క్లుప్తంగా

కార్యదర్శులు జాగ్రత్తగా ఉండండి

ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

తాండూరు రూరల్: కలెక్టర్ నారాయణరెడ్డి గ్రామాల్లో ఎప్పుడైనా పర్యటించవచ్చని, కావున జీపీ కార్యదర్శులు విధి నిర్వాహణలో జాగ్రత్తగా ఉండాలని ఎంపీడీఓ సుదర్శన్ రెడ్డి అప్రమత్తం చేశారు. గురువారం మల్కాపూర్ గ్రామంలో నర్సరీ, క్రిమిటోరియం, పల్లెప్రగతి వనం, కంపోస్ట్ షెడ్‌లను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. నర్సరీలపై నిర్లక్ష్యం చేస్తే అధికారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచు విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మోన్యనాయక్, ఉప సర్పంచు అబ్దుల్ మజీద్, ఫీల్డ్ అసిస్టెంట్ మంగమ్మ, వార్డు సభ్యులు పండరిచారి తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ తదితరులు

మర్పల్లి: మండల పరిధిలోని శాపూర్ కొత్త పంచాయతీకి ఉపాధిహామీ పథకం కింద రూ.10 లక్షలు మంజూరు అయ్యాయి. ఈ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఈ నెల 15 వరకు గడువు విధించింది. ఈ క్రమంలో సర్పంచ్ సాలిబాయి గురువారం సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. మరిన్ని నిధులతో గ్రామంలో నెల కొన్న సమస్యలను పరిష్కరిస్తానని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

చీకట్లో శివారెడ్డిపల్లి!

గ్రామంలో వెలగని వీధి దీపాలు



వీధి దీపాలు వెలగక అంధకారంలో గ్రామం

దోమ: గ్రామాభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా.. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు వాటిని ఖర్చు చేయడంలో అలసత్వం వహిస్తున్నారు. తాజాగా గురువారం రాత్రి శివారెడ్డిపల్లి గ్రామంలో వీధి దీపాలు వెలగక గ్రామం చీకటి మయంగా మారింది. దీంతో రాత్రి వేళల్లో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఎక్కడ విషసర్పాల ఉంటాయోనని భయపడుతున్నారు. వీధి దీపాలు అమర్చాలని సర్పంచ్‌కి, పంచాయతీ కార్యదర్శికి గ్రామస్తులు పలు మార్లు విన్నవించినా.. పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. గ్రామసభలో చెప్పినా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి.. గ్రామంలో వీధి దీపాలు ఏర్పాటు చేయించాలని కోరుతున్నారు.

ప్రజల సహకారంతో గ్రామాభివృద్ధి



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచు

మోమిన్‌పేట: ప్రజల సహకారంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని సర్పంచు అలివేలమ్మ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఏన్కతల గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ రూ.35 లక్షల నిధులతో సీసీరోడ్ల నిర్మాణ పనులు మర్పల్లి ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, శనైశ్వర స్వామి ఆలయ చైర్మన్ మైపాల్‌రెడ్డిలతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణ పనులతో మట్టి రోడ్లు ఉండవని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచు నర్సింహులు, కార్యదర్శి మైపాల్‌రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.

రేపు ఆత్మీయ సమ్మేళనం

హాజరు కానున్న మంత్రి సబితారెడ్డి

దారూరు: ధారూరు మండల కేంద్రంలో ఈనెల 4న (శనివారం) ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజునాయక్, మాజీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డిలు తెలిపారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్థానిక స్టార్ ఫంక్షన్ హాలులో నిర్వహించే ఈ కార్యక్రమానికి విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి హాజరు కానున్నానని తెలిపారు. ఈ సమ్మేళనానికి ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు రావాలని కోరారు.

చిన్న జీపీలపై చిన్నచూపు!

మొక్కలు పెంచి.. ఆకుపచ్చ తెలంగాణగా తీర్చిదిద్ది.. కాలుష్య భూతాన్ని తరిమి కొట్టాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 2015లో హరితహారానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే ఊరూరా ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. ఏటేటా లక్షల మొక్కలు పెంచుతూ.. అవసరమై చోట నాటిస్తూనే ఉంది. కానీ నిధుల కొరత కారణంగా పలు చిన్న గ్రామాల్లో వనాల సంరక్షణ కష్టతరంగా మారింది.

- వేధిస్తున్న నిధుల కొరత
- చేతులెత్తేస్తున్న సర్పంచులు
- కష్టతరంగా మారిన మొక్కల సంరక్షణ
- కళతప్పుతున్న ప్రకృతి వనాలు



ఊరగుంటలోని పల్లెప్రకృతి వనం

దౌల్తాబాద్: ప్రభుత్వం ప్రతి గ్రామంలో పల్లెప్రకృతివనం నిర్మించి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు కృషి చేస్తుండగా.. కొన్ని చిన్న గ్రామపంచాయతీలకు నిధుల కొరత వేధిస్తోంది. ఫలితంగా అక్కడి ప్రజలు ఆహ్లాదానికి అందనంత దూరంలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ప్రతి గ్రామంలోనూ పల్లెప్రకృతి వనాల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే మండలంలోని 33 పంచాయతీల్లో వనాలను ఏర్పాటు చేసింది. పెద్ద పంచాయతీలకు నిధుల కొరత లేకపోవడంతో అక్కడి వనాలు కళకళలాడుతుండగా.. చిన్న జీపీల్లో మాత్రం కళతప్పుతున్నాయి. మండలంలోని ర్యాలగుట్టతండా, బండివాడ, ఊరగుంట, ఈర్లపల్లి, నంద్యానాయక్‌తండా, కుప్పగిరి, అల్లాపూర్, గుముడాల తదితర పంచాయతీలకు సుమారు రూ.50 వేల వరకు నిధులు రావడంతో సదరు పంచాయతీల్లో అటు అభివృద్ధి, ఇటు పల్లె ప్రకృతి వనాల వృద్ధి కష్టతరంగా మారుతుందని సర్పంచులు ఆందోళన చెందుతున్నారు.

పంచాయతీ నిధుల్లోంచే..

ప్రస్తుతం పంచాయతీలకు ప్రభుత్వం కేటాయించిన నిధుల నుంచి ట్రాక్టర్ ఇన్‌స్టాల్‌మెంట్లు, జీపీ కార్మికుల వేతనాలు, వీధిదీపాల ఏర్పాటు, మురికికాలువలు శుభ్రం చేయడం లాంటి అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. ఇందులో నుంచే నిధులను ప్రకృతి వనాలకు డబ్బులు వెచ్చించాలన్న నిబంధనలు ఉండడంతో సర్పంచులకు అది అసాధ్యంగా మారింది. దీంతో వనాలను సంరక్షణ కష్టతరం కావడంతో అవి బోసిపోతున్నాయి. ఉపాధి నిధుల సహకారంతో తక్కువ పెట్టుబడులతో ప్రకృతి వనాలను అభివృద్ధి చేస్తున్నారు. దీంతో పెద్ద పంచాయతీల్లో వనాలు అభివృద్ధి చెందుతుండగా.. చిన్న పంచాయతీల్లో నామమాత్రంగానే ఉంది. దీంతో సర్పంచులు వనాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

> **నిధుల కొరతతోనే**
>
> 
>
> చిన్న పంచాయతీలకు నిధులు చాలా తక్కువగా వస్తున్నాయి. ఊరగుంటలాంటి పంచాయతీలకు ప్రస్తుతం నెలకు రూ.50 వేలు వస్తున్నాయి. ఇందులో నుంచే ట్రాక్టర్ ఇన్‌స్టాల్‌మెంట్, వీధి దీపాలు ట్రాక్టర్ డీజిల్, కార్మికుల వేతనాలు ఇతర కార్యకాలాపాలకు నిధులు వెచ్చించాలి. నిధులు సరిపోకపోవడంతో ఈజీఎస్‌లో మొక్కలు నాటించి నెమ్మదిగా అభివృద్ధి చేస్తున్నాం. కొన్ని గ్రామాల్లో నీటి సదుపాయం లేకపోవడంతో.. ట్యాంకర్ ద్వారా మొక్కలకు నీటిని అందిస్తున్నాం. పల్లె ప్రకృతి వనాలకు నిధులు కేటాయిస్తే బాగుంటుంది.
>
> – రవీందర్, ఎంపీఓ, దౌల్తాబాద్

ఈ బోరుకు మరమ్మతు చేయండి



రావులపల్లిలో మరమ్మతుకు నోచుకోని బోరు మోటారు

మోమిన్‌పేట: ఎండలు ముదురుతున్న వేళ తాగు నీటి ఎద్దడి లేకుండా చూడాలని పలు గ్రామాల ప్రజలు సంబంధిత అధికారులను వేడుకుంటున్నారు. మునుపటిలా చేతిబోరు పంపులు లేవని, ఉన్నవీ వినియోగంలో లేవని చెబుతున్నారు. భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే తాగు నీటికి ఇబ్బందులు తప్పవని, ఉన్న ఒక్క బోరు మోటారుకు మరమ్మతు చేసి ఆదుకోవాలని అధికారులను కోరుతున్నారు. మండల పరిధిలోని కోల్కుంద పంచాయతీకి అనుబంధ గ్రామం రావులపల్లికి తాగు నీటిని అందించేది ఒకేఒక బోరు మోటారు. భగీరథ నీటి సరఫరా ఉన్నన్ని రోజులు ఇబ్బంది లేదంటున్నారు. ఒక వేళ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే ప్రత్యమ్నాయంగా ఉన్న ఒకేఒక తాగునీటి బోరు చెడిపోయింది. నెల రోజులుగా ఎవరూ పట్టించుకోవడం లేదని, ఆ బోరు మోటారు నుంచి నేరుగా ఓవర్ హెడ్ ట్యాంకులకు పైప్‌లైన్ ఉంది. కావున ఈ బోరు మోటారుకు మరమ్మతు చేయించి ఆదుకోవాలని గ్రామస్తులు ఉన్నాతాధికారులను కోరుతున్నారు.

ఘనంగా ఎంఐఎం ఆవిర్భావ దినోత్సవం



కొడంగల్ రూరల్: పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ అధ్యక్షుడు

కొడంగల్ రూరల్: ఎంఐఎం పార్టీ 65వ ఆవిర్భావ దినోత్సవ సంబురాలను గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకొన్నారు. ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బి.గుల్షన్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ముస్లింలు, దళిత, గిరిజనులపై అణచివేత కుట్రలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు ఎంఐఎంకు మద్దతు తెలుపుతూ వచ్చే ఎన్నికల్లో అసమర్థ పాలన ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎండీ ముర్తుజా, షేక్ అజార్, సయ్యద్ ముస్తాఫా, షేక్ రోమన్, ఎండీ.అబీద్, సర్తాజ్, ఎండీ రఫీ తదితరులు పాల్గొన్నారు.

ధారూరులో..

ధారూరు: ఏఐఎంఐఎం పార్టీ ఆవిర్భావి దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మోయిజ్ ఖురేషి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యకర్తలకు పండ్లు పంచిపెట్టారు.

నాలుగేళ్లకే రోడ్డుమీద రోడ్డేందుకు?



- ప్రజాధనం వేస్టెందుకు చేస్తున్నారు?
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామంటున్న స్థానికులు

దౌల్తాబాద్: నాలుగేళ్ల క్రితం ఓ కాలనీలో ఉపాధి నిధులతో సీసీరోడ్డు వేశారు. పలు కారణాలతో గురువారం అదే రోడ్డుపై మరోసారి సీసీ వేయడంతో గ్రామస్తులు ముక్కున వేలేసుకున్నారు. నాలుగేళ్లకే రోడ్డుమీద రోడ్డేందుకు వేస్తున్నారని ప్రశ్నిస్తూ.. ప్రజాధనం వృథా చేస్తున్నారని మండిపడుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. నందారం గ్రామంలోని పలు వీధుల్లో సీసీరోడ్డు లేకున్నా.. ఉన్నరోడ్డుపై సీసీ వేయడం ఎంత వరకు సమంజసమని మాజీ సర్పంచ్ సరోజనమ్మ, కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకుడు రాజశేఖర్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ విషయంపై నేడు (శుక్రవారం) కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఇదే విషయమై పంచాయతీరాజ్ ఏఈని ప్రశ్నించగా.. తాను మూడు మండలాలకు ఇన్‌ఛార్జిగా ఉన్నానని, గ్రామపంచాయతీ తీర్మానం ఉందని, తాను ఏమీ చేయలేనని చేతులెత్తేయడం ఎంతవరకు న్యాయమన్నారు. రోడ్డు ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

చైతన్య కళాశాల అనుమతి రద్దు చేయాలి



వికారాబాద్‌లో ధర్నా చేస్తున్న ఎస్ఎస్‌యూఐ నాయకులు

అనంతగిరి: హైదరాబాద్ నార్సింగ్‌లో విద్యార్థి సాత్విక్ ఆత్మహత్యకు కారణమైన శ్రీ చైతన్య కళాశాల అనుమతిని తక్షణమే రద్దు చేయాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఏనుగు జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం వికారాబాద్ పట్టణం ఎన్టీఆర్ చౌరస్తాలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం పోలీసులు నాయకులను అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి కుటుంబానికి కళాశాల తరపున రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వం కార్పొరేట్ విద్యా సంస్థలకు వత్తాసు పలుకుతోందని విమర్శించారు. మరోసారి ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ఆ కళాశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు రద్దు చేయాలి..

చేవెళ్ల: కార్పొరేట్ శ్రీచైతన్య పాఠశాల, కళాశాల గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు అరుణ్‌కుమార్, శ్రీనివాస్‌లు అన్నారు. చేవెళ్లలో గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శ్రీచైతన్య కళాశాలలో విద్యార్థి మృతికి నిరసనగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువు పేరుతో మానసిక ఒత్తిడి ఎక్కువైందని దాని కారణంగా చాలా మంది విద్యార్థులు చనిపోతున్నారని, చనిపోయిన విద్యార్థి కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వీధి కుక్కలతో జాగ్రత్త

- వాటికి దూరంగా ఉండాలి
- మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్

కొడంగల్ రూరల్: విద్యార్థులు, చిన్నారులు వీధి కుక్కల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శునకాల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. వీధుల్లో వెళుతున్నప్పుడు కుక్కలు ఉన్న విషయాన్ని గుర్తించాలని, గొలుసు కట్టు, ఫెన్సింగ్ లోపల ఉన్న వాటికి దగ్గరగా నడవకూడదని చెప్పారు. ఏదైనా కుక్క అరుస్తూ మీ దగ్గరకు వస్తే ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా.. కదలకుండా ఉండాలని తెలిపారు. ఆహారం తింటున్నా.. నిద్రిస్తున్నా.. పిల్లలున్న తల్లి కుక్కల దగ్గరకు వెళ్లకూడదని చెప్పారు. కుక్క కరిస్తే.. గాటు వద్ద సబ్బుతో 10నిమిషాల పాటు వత్తి గట్టిగా కడగాలని, దగ్గర్లోని ఆస్పత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించాలని సూచించారు. రేబిస్ వ్యాధి నిరోధక టీకాను తప్పని సరిగా వేయించుకోవాలని వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ప్రసన్న, ఉపాధ్యాయ సిబ్బంది, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ భరత్‌కుమార్, ఆర్పీలు ఆనందమ్మ, అన్నపూర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

'సేవచేసేవాడే నిజమైన నాయకుడు'



కిరణ్‌ను సన్మానిస్తున్న కమల నాథులు

కుల్కచర్ల: నిస్వార్థంగా ప్రజలకు సేవచేసే ఏకైక పార్టీ బీజేపీయేనని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య అన్నారు. గురువారం మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వర ఆలయంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేయాలన్న తపనతో ఉన్న వారే నిజమైన నాయకుడని చెప్పారు. రానున్న ఎన్నికల్లో పరిగి నియోజకవర్గంలో బీజేపీ విజయ కేతనం ఎగురవేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్, మాజీ అధ్యక్షుడు కాటనిపల్లి ఆంజనేయులు, మొత్కూరు సర్పంచ్ కేశవులు, నాయకులు చంద్రలింగం, హన్మంతు, నర్సింహారెడ్డి, భీమయ్య, గడుసు మైపాల్, మోనాచారి, వెంకటయ్య, రాజశేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గంటలోనే నగదు పట్టివేత

- బాధితురాలికి రూ.1.70 లక్షలు అందజేత
- సీసీ కెమెరాలతో సత్వర న్యాయం: సీఐ



బాధితురాలికి డబ్బును అందజేస్తున్న పోలీసులు

అనంతగిరి: సీసీ కెమెరాల ఆధారంగా రూ.1.70లక్షల నగదును గంటలోపే పట్టించిన సంఘటన వికారాబాద్‌లో చోటు చేసుకుంది. సీఐ శీను తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఫిబ్రవరి 28న తాండూర్ మండలం సిరిగిరిపేటకు చెందిన బాలమణి వికారాబాద్ పట్టణంలోని ఇంద్రానగర్‌కు వచ్చారు. బుధవారం ఇంటికి వెళ్లేందుకు ఇంద్రానగర్ నుంచి బస్టాండ్‌కు వెళ్లే క్రమంలో ఆమె వద్ద ఉన్న రూ.1.70లక్షలు కవర్‌ను బ్యాగ్‌లో పెట్టుకొని ఆటోలో ఎక్కి, డబ్బుల కవర్‌ను వెనుకభాగంలో పెట్టింది. గమ్యం చేరుకోగానే ఆటో దిగి, డబ్బుల సంచిని మరిచిపోయింది. ఈ విషయాన్ని ఆటో డ్రైవర్ కూడా గమనించలేదు. కాగా బాలమణి బస్సు ఎక్కిన అనంతరం కవర్ మరిచిన విషయాన్ని గమనించి వెంటనే పోలీసులను ఆశ్రయించింది. అప్రమత్తమయైన పోలీసులు.. సీసీ కెమెరాల ఆధారాలతో ఆరా తీశారు. ఆటో యంఆర్‌పీ చౌరస్తాలో ఉందని గుర్తించి, అక్కడికి వెళ్లి ఆటోలో ఉన్న డబ్బు సంచిని స్వాధీనం చేసుకున్నారు. బాధితురాలికి గంటలోపే డబ్బులు అందజేయడంతో ఆమె సంతోషం వ్యక్తం చేసింది. సీసీ కెమెరాల ఆధారంగానే ఇంత త్వరగా ఛేదించామని సీఐ తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని ఆయన కోరారు.

'పాత కలెక్టరేట్‌లోనే పరీక్ష రాయాలి'

అనంతగిరి: టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ గురుకుల పాఠశాలల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీఓఈ ఇంటర్ అర్హత పరీక్ష రాసే అభ్యర్థులకు.. టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ మోమిన్‌పేట కేంద్రం అని సెంటర్ పడిన అభ్యర్థులు.. ప్రస్తుతం ఆ పాఠశాల వికారాబాద్‌కు సమీపంలోని బూర్గుపల్లి గేట్ వద్ద గల పాత కలెక్టర్ భవనంలో కొనసాగుతున్నందని పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ పీబీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున అభ్యర్థులంతా ఈ విషయాన్ని గమనించి ఈ సెంటర్‌కు రావాలని సూచించారు. పరీక్ష ఈనెల 5న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్న ఒంటిగంట వరకు ఉంటుందని తెలిపారు. కావున విద్యార్థులు ఒక గంట ముందుగానే చేరుకోవాలని చెప్పారు. ఈ విషయాన్ని అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు తప్పకుండా గమనించాలన్నారు. మరిన్ని వివరాలకు 79950 10623 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

గ్రామాల్లోనే ఉపాధి కల్పించాలి

ఎంపీడీఓ రాజ్‌కుమార్



దార్గులపల్లిలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

మర్పల్లి: ఉపాధి కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లకుండా.. గ్రామాల్లోనే ఉపాధి పనులు కల్పించి, వలసలు నివారించాలని ఎంపీడీఓ రాజ్‌కుమార్ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందికి చెప్పారు. గురువారం మండల పరిధిలోని దార్గులపల్లి, మొగిలిగుండ్ల గ్రామాలలో ఉపాధి కూలీలు చేపడుతున్న పనులను ఆయన పరిశీలించిన అనంతరం కూలీలతో మాట్లాడారు. ఉపాధిహామీ చట్టం ప్రకారం కూలీపనులకు వచ్చిన ప్రతి కూలీ.. పని కల్పించిన ప్రదేశంలో పనులు చేస్తూ.. ఎఫ్ఏ నిర్దేశించిన సమయంలో కూలీలు గ్రూప్ ఫొటో దిగాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామంలో చేపట్టిన పల్లె ప్రకృతి వనం, కంపోస్ట్‌షెడ్, వైకుంఠ ధామం, గ్రామీణ క్రీడా ప్రాంగణం, వన నర్సరీ పనులను ఆయన తనఖీ చేశారు. గ్రామాల్లో ఏమైనా పనులు పెండింగ్ ఉంటే.. ఈ నెల 15లోపు పూర్తి చేసే విధంగా కృషి చేయాలని జీపీ కార్యదర్శులకు ఎంపీడీఓ చెప్పారు. ముఖ్యంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం సమస్య తలెత్తకుండా చూడాలని, అందుకు సర్పంచ్‌లతో కలిసి పనిచేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ వెంట ఏపీఓ అంజిరెడ్డి, ఈసీ విఠల్, టీఏ అశోక్‌రెడ్డి, పలు గ్రామాల కార్యదర్శులు, ఎఫ్ఏలు ఉన్నారు.

వంటగ్యాస్ ధర తగ్గించాలి

కొడంగల్ రూరల్: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వారు మాట్లాడారు. మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు నేడు (శుక్రవారం) అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్రం గ్యాస్ ధరలను పెంచుతూ సామాన్యుల నడ్డి విరుస్తుందని విమర్శించారు. అందుకు నిరసనగా.. నేడు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన చేపడుతున్నామని, కార్యక్రమంలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పాల్గొంటారని అన్నారు. కార్యక్రమానికి మహిళలు, కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు మధుసూదన్‌యాదవ్, రమేష్‌బాబు ఉన్నారు.

దిగుబడి ఎక్కువ.. ఆదాయం తక్కువ

- వేరుశనగ రైతుల వెతలు
- రెండింతలు పెరిగిన కూలీరేట్లు
- అయినా దొరకని కూలీలు
- మార్కెట్లో దక్కని మద్దతు ధర
- వ్యాపారుల చేతివాటంతో నష్టపోతున్న రైతులు



వేరుశనగ సేకరిస్తున్న కూలీలు

ధారూరు: రైతు కూలీలు దొరక్క వేరుశనగ రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో కొందరు రైతులు వేరుశెనగ పంటను సాగుచేశారు. అయితే ఉత్పత్తి అయిన వేరుశెనగ చేతికందాలంటే దానిని సేకరించడానికి కూలీలు కావాలి. కానీ సకాలంలో కూలీలు దొరక్క, దొరికినా కూలీ రేట్లు ఎక్కువగా అడుగుతుండడంతో ఆ రైతులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామాలు, తండాల్లో ఒక్కో కూలీకి రోజుకు రూ.250 ఇచ్చేవారు. ప్రస్తుతం రూ.500లతో పాటు, ఓ కల్లు సీసా ఇవ్వాల్సి వస్తుందోని రైతులు వాపోతున్నారు. ఆశించిన దిగుబడి వచ్చినా.. మార్కెట్లో ధరలు దిగజారి పోతుండడంతో పెట్టుబడులు పోను లాభాలు తక్కువగా వస్తున్నాయని రైతులు చెప్పారు.

దిగజారుతున్న ధర..

5 ఎకరాల్లో సాగుచేస్తే పెట్టుబడి రూ.లక్ష అవుతుందని, పంట తీతకు అధిక మొత్తంలో డబ్బులు వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. రోజు కూలీ కాకుండా.. మానెడు కాయ తెంపితే రూ.10 నుంచి రూ.25 వరకు చెల్లిస్తున్నామని రైతులు చెప్పారు. వారం క్రితం ఉన్న ధర నేడు లేదని, ఒక్కసారిగా రూ.వెయ్యి వరకు పడిపోయిందన్నారు. దీంతో పాటు క్వింటాల్‌కు సంచి బాజు, తరుగు పేరిట 2,3కిలోల చొప్పున తీస్తున్నారని, హమాలీ వేరుగా ఇవ్వాల్సి వస్తోందని, కమీషన్ ఇవ్వగా ఇవన్నీ ఏంటని ప్రశ్నిస్తే.. మార్కెట్‌లో ఇలాగే ఉంటుందని ఓ రైతు వాపోయాడు.

రైతుల ఇంటికే వ్యాపారులు

వ్యాపారులు నేరుగా వేరుశన రైతుల ఇంటి వద్దకే వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. కమీషన్ డబ్బులు ఉండవన్న ధీమాతో విక్రయిస్తున్న సంచి బాజు, ముట్టి, తరుగు పేరిట, తూకంలో హమాలీ చేతివాటంతో నష్టపోతున్నామని రైతులు విచారం వ్యక్తం చేశారు. గత్యంతరం లేక అమ్ముకోక తప్పడం లేదని, ఏమైనా ప్రశ్నిస్తే మార్కెట్ ధర కన్నా ఎక్కువే చెల్లిస్తున్నామని నమ్మిస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. కాగా కొంతమంది రైతులు సకాలంలో పంట చేతికి వచ్చేలా కూలీలు అడిగిన డబ్బులు ఇవ్వడంతో వారి వద్దకు రెండంకెల సంఖ్యలో వెళుతుండటం గమనార్హం.